క్లుప్తంగా

నాగార్జున యాదవ్‌ను కలిసిన వైఎస్సార్‌ సీపీ నేతలు



నాగార్జున యాదవ్‌ను కలిసిన డక్కిలి మండల వైఎస్సార్‌సీపీ నేతలు

డక్కిలి : రాష్ట్ర విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్‌ నాగార్జున యాదవ్‌ను గురువారం రాత్రి వైఎస్సార్‌ సీపీ డక్కిలి మండల కన్వీనర్‌ చింతల శ్రీనివాసులురెడ్డి, నేతలు కలిశారు. నాగార్జున యాదవ్‌ మాట్లాడుతూ వైఎస్సార్‌ సీపీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో కలిసి కట్టుగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో వీకేవై, సంగనపల్లి సర్పంచులు డీపీ యాదవ్‌, ఆర్‌ చిరంజీవి, నేతలు వేణు నాయుడు, ప్రభాకర్‌బాబు, శ్రీహరిరెడ్డి, ఈశ్వరయ్య, మురళీ, కోటి, బండి రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

వెంకటగిరి రూరల్‌ : పట్టణంలోని రాజావీధిలోని భవవాన్‌ శ్రీ సత్యసాయి బాబా సేవా సమితి కన్వీనర్‌ శెట్టిపల్లి మోహన్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో వుంచుకుని ప్రజల దాహార్తి తీర్చేందుకు తమ వంతు సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు బాలవికాస్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేస్తున్న సిబ్బంది

కోట: ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ మండలంలోని చంద్రశేఖరపురంలో శుక్రవారం సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కనీసం సెంటు స్థలంలోనైనా ప్రకృతి వ్యవసాయం చేయాలని చెప్పారు. రైతులు తమ పొలంలో నవధాన్యాలు వేసుకోవాలని సూచించారు. అనంతరం ఖరీఫ్‌ యాక్షన్‌ ప్లాన్‌పై వివరించారు. కార్యక్రమంలో వెలుగు సీసీ శ్రీకాంత్‌, ఎంఎం శ్రీనివాసులు, ఐసీఆర్పీ భాగ్యలక్ష్మీ, మునెమ్మ పాల్గొన్నారు.

కండలేరు డ్యామ్‌ డీఈఈ బాధ్యతల స్వీకరణ



నిజీని సత్కరిస్తున్న ఇంజినీరింగ్‌ అధికారులు

రాపూరు : మండలంలోని కండలేరు జలాశయం డీఈఈగా నిజి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె శ్రీకాకుళంలోని రాజాంలో ఏఈఈగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి బదిలీ అయ్యారు. ఆమెను ఇంజినీరింగ్‌ సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో డీఈఈ రవీంద్ర బాబు, సిబ్బంది వెంకటసుబ్బయ్య, అంకయ్య, ఎన్జీవో సంఘం అధ్యక్షుడు తోట మల్లికార్జున్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చల్లని నీరు



మజ్జిగ అందజేస్తున్న వేనాటి రామచంద్రారెడ్డి

సూళ్లూరుపేట: పట్టణానికి చెందిన వేనాటి రామచంద్రారెడ్డి ప్రజల దాహార్తిని తీర్చడానికి తన కార్యాలయం వద్ద శుక్రవారం కూలర్‌ను ఏర్పాటు చేశారు. దాన్ని ఆయన స్నేహితులు కాళంగి ప్రభాకర్‌, డాక్టర్‌ చెన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, వాసం రెడ్డి చంద్రశేఖర్‌ రెడ్డి ప్రారంభించారు. ప్రజలకు చల్లటి మజ్జిగ అందజేశారు. వేసవి ముగిసే వరకు చల్లటి నీరు అందజేస్తామని వేనాటి రామచంద్రారెడ్డి తెలిపారు. గ్రామాల నుంచి పట్టణానికి వచ్చే ప్రజలు వాటర్‌ బాటిల్‌ కొనుక్కోలేని స్థితిలో ఉంటారని, వారికి ఆసరాగా ఉండేందుకు కూలర్‌ను ఏర్పాటుచేసినట్టు తెలిపారు.

సెల్‌ ఫోన్‌ చోరీపై ఫిర్యాదు

చిల్లకూరు : నెల్లూరు నుంచి తడకు వెళుతున్న బస్సులో ప్రయాణిస్తుండగా సెల్‌ఫోన్‌ చోరీకి గురైనట్టు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం మేరకు.. బాధితుడు నెల్లూరులో తడ వెళ్లడానికి బస్సు ఎక్కాడు. బస్సు నెల్లూరు పట్టణం దాటే వరకు అతని వద్ద సెల్‌ ఫోన్‌ ఉంది. తర్వాత ఎవరో చోరీ చేశారు. అతను ప్రయాణికులను అందరినీ అడిగాడు. ఫలితం లేదు. కాల్‌ చేస్తే మొదట రింగ్‌ అయింది. తర్వాత స్విచ్‌ ఆఫ్‌ వచ్చింది. దీంతో అతను చిల్లకూరు పోలీస్‌ స్టేషన్‌ వద్ద బస్సును నిలిపి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఎక్కడి సమస్యలు అక్కడే

దొరవారిసత్రం మండలంలోని పలు ప్రాంతాల్లో రైతులు భూ సమస్యలతో ఏళ్ల తరబడి సతమతం అవుతున్నారు. రైతులు ఆందోళన చేసినప్పుడు రెవెన్యూ అధికారులు సర్వేలు చేసి సరిపెట్టేస్తున్నారు. శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారు. ప్రభుత్వ, పట్టా భూములను ఆక్రమించుకుని రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపైనా చర్యలు తీసుకోవడం లేదు. దీంతో సామాన్య రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. న్యాయం కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.



అగ్రిగోల్డ్‌ ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూమి ఇదే

- భూ సమస్యలతో రైతుల సతమతం
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న వైనం
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

దొరవారిసత్రం : మండలంలోని బూదూరు గ్రామం పరిధిలో ఒక రియల్టర్‌ రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి భూములను విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. ముఖ్యంగా బూదూరు గ్రామం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 31-24, 46-28, 39-15, 37-19, 37-4, 40-15, 51-8, 59-1, 53-12, 47-1, 47-7, 46-2, 47-12, 70-1, 65-32 లోని 20 ఎకరాలకు పైగా రెవెన్యూ రికార్డులను తారుమారు చేశాడు. ఇందుకోసం రెవెన్యూ సిబ్బందికి రూ.లక్షలు ముడుపులు చెల్లించాడు. ఒకరికి తెలియకుండా ఒకరి పేరుతో రికార్డులు సృష్టించి మూడో వ్యక్తికి విక్రయించి రిజిస్ట్రేషన్‌ చేయించాడు. దీంతో రైతులు, భూములు కొనుగోలు చేసిన వారి మధ్య వివాదం తలెత్తింది. ఈ విషయంపై ఆరేళ్ల నుంచి రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అధికారులు ఒటికి రెండు దఫాలు గ్రామ సభలతోపాటు తహసీల్దార్‌ కార్యాలయంలో రెవెన్యూ కోర్టు పెట్టి విచారణ జరిపి చేతులు దులుపుకున్నారు. ఇప్పటి వరకు తమకు న్యాయం జరగలేదని రైతులు వాపోతున్నారు.

నెలబల్లిలో 20 ఎకరాల ప్రభుత్వ భూమి విక్రయం

నెలబల్లి రెవెన్యూ పరిధిలోని 319 నుంచి 332 వరకు వున్న సర్వే నంబర్లలో 83 ఎకరాలను ఇటీవల ఒక భూస్వామి టైల్స్‌ కంపెనీకి విక్రయించాడు. ఇందులో 20 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉన్నట్లు అధికార పార్టీ నాయకులు, రైతులు గుర్తించి రెవెన్యూ అధికారులతోపాటు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. ఈ ప్రాంతంలో ప్రస్తుతం ఎకరా భూమి రూ.12 లక్షల నుంచి రూ.14 లక్షల వరకు పలుకుతోంది. అలాగే పోలిరెడ్డిపాళెం, ఏకొల్లు, కల్లూరు, పూలతోట, ఆనేపూడి తదితర ప్రాంతాల్లోనూ భూ సమస్యలు నెలకొన్నాయి.

నాకు తెలియకుండానే విక్రయించేశారు



నాకు బూదూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని 51-8, 53-1, 59-1 సర్వే నంబర్లలో అర ఎకరా భూమి ఉంది. దాన్ని నేను అమ్మేసినట్లు ఫోర్జరీ సంతకాలతో రికార్డులు తయారు చేసి బయట ప్రాంతానికి చెందిన వారికి విక్రయించారు. అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు.

– సాలు రంగయ్య, బూదూరు ఎస్సీ కాలనీ

నాకు తెలియకుండా రిజిస్ట్రేషన్‌ చేసేశారు



నాకు అక్కరపాక రెవెన్యూలో సర్వే నంబరు 101లో ఎకరా భూమి ఉంది. దీన్ని రియల్టర్లు నాకు తెలియకుండానే అగ్రిగోల్డ్‌ సంస్థకు రిజిస్ట్రేషన్‌ చేయించారు. ఈవిషయాన్ని రెవెన్యూ అధికారులకు పలుమార్లు తెలియజేసినా ఫలితం లేదు. రెవెన్యూ సదస్సులో విన్నవించినా పట్టించుకోలేదు.

– మన్నేలి మనోహరయ్య, అక్కరపాక

అక్కరపాకలో అగ్రిగోల్డ్‌ భూములు అన్యాక్రాంతం



అగ్రిగోల్డ్‌ భూములను పరిశీలిస్తున్న సీఐడీ అధికారులు(ఫైల్‌)

అక్కరపాక రెవెన్యూ పరిధిలో వివిధ సర్వే నంబర్లలోని 111.66 ఎకరాల భూములను రియల్టర్లుగా అవతారం ఎత్తిన తెలుగు తమ్ముళ్లు తప్పుడు డాక్యుమెంట్లతో అగ్రిగోల్డ్‌ సంస్థకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. డిపాజిట్‌ దారులకు నగదు చెల్లింపు పెద్ద సమస్యగా మారడంతో ఈ సంస్థకు చెందిన ఆస్తులను ప్రభుత్వం అటాచ్‌ చేసుకుంది. అంతేగాక కేసును సీబీసీఐడీకి అప్పగించింది. సీఐడీ అధికారులు హైకోర్టు ఆదేశాల మేరకు అక్కరపాకలోని అగ్రిగోల్డ్‌ భూములను సర్వే చేయించారు. 111.66 ఎకరాల భూముల్లో సీలింగ్‌ ల్యాండ్‌కు చెందిన వివరాలను పొందుపరచలేదు. దీన్ని అవకాశంగా తీసుకున్న అధికార పార్టీ నాయకుడైన రియల్టర్‌ సీలింగ్‌ ల్యాండ్‌పై కన్నేశారు. ఈ క్రమంలోనే 101-2 నుంచి 19 వరకు సర్వే నంబర్లలోని 11 ఎకరాల భూమిని ఆక్రమించుకునేందుకు పథకం పన్నారు. రాత్రికే రాత్రే భూమిని దున్నడానికి ప్రయత్నించారు. స్థానికులు గుర్తించి సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. అతనిపై అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.

నేడు శ్రీవారి బ్రహ్మోత్సవాలపై సమీక్ష

రాపూరు: మండలంలోని పెంచలకోనలోని టూరిజం హాల్‌లో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల విజయవంతంపై సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఏసీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈ నెల 8వ తేదీ నుంచి 14 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఏర్పాట్లపై దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనాయణరెడ్డి, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఆర్డీవో నాగసంతోషిణి అనూష సమీక్షించనున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నాయుడుపేట టౌన్‌ : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మీ అధ్యక్షతన జరిగే సమావేశంలో అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష ఉంటుందన్నారు. తమ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలు తీసుకురావాలని సూచించారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరుకావాలని కోరా రు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



గూడూరు డీఎస్పీ కార్యాలయంలో పరిసరాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

గూడూరు రూరల్‌ : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా రోగాలకు దూరంగా ఉండి ఆరోగ్యంగా ఉండొచ్చని గూడూరు డీఎస్పీ గీతాకుమారి తెలిపారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గూడూరు డీఎస్పీ కార్యాలయం ఆవరణను శుభ్రం చేశారు. ఆమె మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా లేకపోతే రోగాలు ప్రబలుతాయన్నారు. కుటుంబం నుంచి గ్రామం, గ్రామం నుంచి పట్టణాలకు వ్యాధులు విస్తరిస్తాయని చెప్పారు.

తీరప్రాంత రైతుల ఆందోళన



ఆందోళన చేస్తున్న తూర్పుకనుపూరు పంచాయతీ ప్రజలు

చిల్లకూరు : తాము ఎన్నో ఏళ్లుగా పంటలు సాగు చేసుకుంటున్నామని, ఇప్పుడు ఆ భూముల్లో సాగు చేయవద్దని ఆంక్షలు పెట్టడం ఎంత వరకు సబబని తూర్పుకనుపూరు పంచాయతీలోని ఐదు గ్రామాల ప్రజలు వాపోయారు. వారు శుక్రవారం ఆందోళనకు దిగారు. వారు మాట్లాడుతూ గతంలో క్రిష్ణపట్నం పోర్టు కోసం తూర్పుకనుపూరు పంచాయతీలోని ఐదు గ్రామాల్లో వున్న భూములను సేకరించినట్టు తెలిపారు. కొంతకాలం తర్వాత క్రిష్ణపట్నం అదానీ ఫౌండేషన్‌ చేతికి వెళ్లి పోయిందని, భూములు నవయుగ ఆధ్వర్యంలోనే ఉన్నాయన్నారు. ఈ క్రమంలో తాము ఆ భూముల్లో వేరుశనగ పంట సాగు చేసుకుంటున్నామని తెలిపారు. ఇప్పుడు సాగు చేయరాదని అంటున్నారని వాపోయారు. అప్పట్లో ఎకరాకు రూ.1.50 లక్షలు మాత్రమే పరిహారం ఇచ్చారని, ఇప్పుడు క్రిస్‌ సిటీకి సేకరిస్తున్న భూములకు ఎకరాకు రూ.8 లక్షలు ఇస్తున్నారని తెలిపారు. తమ కూడా పరిహారం ఇచ్చి భూములు స్వాధీనం చేసుకోవాలని డిమాండ్‌ చేశారు. తమకు అప్పట్లో ఇచ్చిన మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామని, తమ భూములు తిరిగి ఇచ్చేయాలని కోరారు. నవయుగ సంస్థ ప్రతినిధుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడారు. శాంతియుతంగా చర్చలు జరిపి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించడంతో వారు ఆందోళన విరమించారు.

కాలువల పరిశీలన



కాలువలను పరిశీలిస్తున్న సోమశిల ఈఈ మల్లికార్జున్‌

కలువాయి(సైదాపురం) : కలువాయి మండలంలో రెండో పంటకు నీరు విడుదల కోసం వెదనపర్తి, కలువాయి దక్షిణ కాలువ కింద డిస్ట్రిబ్యూటరీ పాయింట్లను శుక్రవారం సోమశిల ఈఈ మల్లికార్జున్‌ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రెండో విడత పంటలు సాగు చేసేందుకు నీటిని విడుదల చేయనున్నట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో కాలువ స్థితిగతులను పరిశీలించినట్టు వివరించారు. కార్యక్రమంలో చేజర్ల ప్రాజెక్టు ఉప విభాగం డీఈఈలు పురుషోత్తం, సురేష్‌, ఇరిగేషన్‌ ఏఈ ఖలీల్‌ పాల్గొన్నారు.

టిప్పర్లను అడ్డుకున్న ఏరూరు గ్రామస్తులు



రోడ్డులో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

చిల్లకూరు : సాగరమాల రోడ్డు నిర్మాణం కోసం మట్టి, గ్రావెల్‌ను తరలిస్తున్న భారీ టిప్పర్లతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఏరూరు గ్రామస్తులు ఆరోపించారు. వారు శుక్రవారం వెంకటసరస్వతి పాఠశాల సమీపంలో టిప్పర్లను అడ్డుకున్నారు. వారు మాట్లాడుతూ ఒకటిన్నర సంవత్సరం నుంచి భారీ టిప్పర్లతో మట్టి, గ్రావెల్‌ తరలిస్తున్నారని తెలిపారు. దీంతో రోడ్డు పూర్తిగా దెబ్బతినిందన్నారు. నడిచేందుకు కూడా వీలుకాకపోవడంతో ఇటీవల ఆందోళన చేపట్టామన్నారు. దీంతో ఒక సబ్‌ కాంట్రాక్టర్‌ చింతవరం వరకు రోడ్డుకు మరమ్మతులు చేశారని పేర్కొన్నారు. వరగలి సమీపంలో రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నా కాంట్రాక్టర్లు పట్టించుకోలేదన్నారు. రోడ్డుపై కంకర తేలడంతో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నట్టు వివరించారు. ఇప్పటికైనా రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని, లేకుంటే వాహనాల రాకపోకలను పూర్తిస్థాయిలో అడ్డుకుంటామని హెచ్చరించారు. కాంట్రాక్టర్‌ సంస్థ ప్రతినిధులు అక్కడికి చేరుకుని గ్రామస్తులతో చర్చించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఘనంగా రామానుజ జయంతి



స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: పెంచలకోనలో శుక్రవారం రామానుజ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నరసింహస్వామి, ఆదిలక్ష్మిదేవి, చెంచులక్ష్మీదేవి, రామానుజుల విగ్రహాలకు స్నపన తిరుమంజనం చేశారు. సాయంత్రం స్వామి వారి అలంకార మండపంలో నరసింహస్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను కొలువుదీర్చారు. వారికి అభిముఖంగా రామానుజుల ఉత్సవ విగ్రహాన్ని ఉంచి అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం మేళతాళాలు మంగళ వాయిద్యాలతో కోన మాడవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు.

ధాన్యానికి అందని గిట్టుబాటు ధర

- రైతులకు కన్నీరు మిగిల్చిన కూటమి ప్రభుత్వం
- ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌

చిట్టమూరు : రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యానికి గిట్టుబాటు ధర అందడం లేదని, కూటమి ప్రభుత్వం రైతు ఇంట కన్నీరు మిగిల్చిందని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌ సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్‌ ఆరోపించారు. ఆయన శుక్రవారం చిట్టమూరులో విలేకరులతో మాట్లాడారు. వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో బీపీటీ 5204 (పెద్ద జిలకర) పుట్టి (860 కేజీలు) రూ.24 వేల వరకు ధర పలికిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పుట్టి రూ.15 వేలకు కూడా కొనడం లేదని వాపోయారు. మద్దతు ధర ఇవ్వాలని రైతులు అడిగితే ధాన్యం వద్దని మిల్లర్లు, దళారులు వెళ్లిపోతున్నారని ఆరోపించారు. రైతుల నుంచి తక్కువ ధరకు ధాన్యం కొని బియ్యం ఆడించి 25 కేజీల బస్తా రూ.1500లకు విక్రయిస్తున్నారని విమర్శించారు. మిల్లర్లు సిండికేట్‌గా ఏర్పడి కూటమి ప్రభుత్వ అండదండలతో ఇష్టానుసారంగా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుందన్నారు. గింజ ధాన్యం కూడా కొనుగోలు చేయలేదన్నారు. ఒక పుట్టి ధాన్యంపై ట్యాక్సుల ద్వారా ప్రభుత్వానికి సుమారు రూ.5 వేల వరకు ఆదాయం వస్తుందని వివరించారు. ఆదాయం మాత్రం తీసుకుని రైతులకు న్యాయం చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బీపీటీ 5204 వరి ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి, జిల్లా కార్యదర్శి పేట రాజీవ్‌రామిరెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న కౌన్సిలర్‌ నారాయణ

వెంకటగిరి రూరల్‌ : బాల్య వివాహాలు చటరీత్యా నేరమని 4వ వార్డు కౌన్సిలర్‌ ఎంఏ నారాయణ తెలిపారు. పట్టణంలోని బొప్పాపురం సాలికాలనీలో శుక్రవారం చైల్డ్‌ మ్యారేజెస్‌ ప్రొహిబిషన్‌ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పురుషులకు 21, యువతులకు 18 ఏళ్లు నిండిన తర్వాతే పెళ్లి చేయాలన్నారు. బాల్యంలోనే పెళ్లి చేయడం వల్ల బిడ్డకు జన్మనిచ్చే సమయంలో బాలిక ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగినట్లు తెలిస్తే ఐసీడీఎస్‌, పోలీసు అధికారులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్వో శ్రీనివాసులు, మహిళా పోలీసు వరలక్ష్మి, ఏఎన్‌ఎం మల్లీశ్వరి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పథకం ప్రకారమే గురుమూర్తి హత్య!

- టీడీపీ నేతల ప్రోద్బలంతోనే హత్య
- వెలుగులోకి వస్తున్న నిజాలు
- కుట్రదారుల పేర్లు తొలగించాలని పోలీసులపై ఒత్తిడి



ఎల్లు గురుమూర్తి (ఫైల్‌)

నాయుడుపేట టౌన్‌: ఓజిలి మండలం అత్తివరానికి చెందిన ఎల్లు గురుమూర్తి(52)ని అతని ప్రత్యర్థులుగా ఉన్న టీడీపీ నేతలు పథకం ప్రకారం హత్య చేయించినట్టు స్పష్టమవుతోంది. ఈ మేరకు నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. అత్తివరం గ్రామానికి చెందిన గురుమూర్తి వేలూరు అనీల్‌ రెడ్డితో కలిసి బైక్‌లో నాయుడుపేట నుంచి వస్తున్నట్టు తెలుసుకుని కోనేటి రాజుపాళెం–ద్వారకపురం మధ్య అశోక్‌ లేలాండ్‌ దోస్తు వాహనంతో ఢీకొట్టించి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలినట్టు సమాచారం. ఇందులో ప్రధాన కారకులైన కొంత మంది టీడీపీ నేతల పేర్లు కేసులో లేకుండా చేయాలని పోలీసులపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి వస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. గురుమూర్తి కుమారుడు ఎల్లు గురుతేజ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న నిందితుల పేర్లు ఉన్నాయి. వాటిలో ప్రధాన నిందితుల పేర్లు లేకుండా చేస్తే ఊరుకునేది లేదని మృతుడి కుటుంబ సభ్యులు హెచ్చరిస్తున్నారు. ఈ కేసును అన్నికోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, త్వరలోనే నిందితులను అరెస్టు చేస్తామని సీఐ బాబి తెలిపారు.

వెంకటగిరి చేరుకున్న ఉడిపి అడయార్‌ పీఠాధిపతి



వెంకటగిరి రూరల్‌ : ఉడిపి అడయార్‌ మఠం పీఠాధిపతి ఈషాప్రియ తీర్థస్వామిజీ శుక్రవారం రాత్రి వెంకటగిరికి చేరుకున్నారు. ధర్మ పరిరక్షణలో భాగంగా గో సంరక్షణ, గ్రామీణ చేతి వృత్తుల అభివృద్ధి, రైతుల సంక్షేమం, జానపద కళల అభివృద్ధిని కాంక్షిస్తూ పాదయాత్ర చేస్తున్నట్టు తెలిపారు. వెంకటగిరికి చేరుకున్న పీఠాధిపతికి పలువురు స్థానికులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మదర్‌ అకాడమీ సమీపంలోని ఎస్‌ఆర్‌ ఫంక్షన్‌ హాల్‌కు చేరుకున్నారు. అక్కడ ఆయన శనివారం మధ్యాహ్నం వరకు భక్తులకు అందుబాటులో ఉండనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కిశోరి వికాసంతో బాలికలకు బంగారు భవిష్యత్తు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి సీడీపీవో స్వరూపారాణి

గూడూరు రూరల్‌ : కిశోరి వికాసంతో బాలికలకు బంగారు భవిష్యత్తు ఉంటుందని ఐసీడీఎస్‌ ఇన్‌చార్జి సీడీపీవో స్వరూపారాణి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం కిశోరి వికాసంపై బాలికలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ 11–18 ఏళ్లలోపు బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబన తదితరాలపై అవగాహన కల్పించడమే కిశోరి వికాసం కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. బాలికలు తమకు ప్రభుత్వం కల్పించిన హక్కులను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం బుజ్జమ్మ, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్లు హైమావతి, చెంచులక్ష్మీ, మహిళా పోలీసులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

కిశోరి వికాసాన్ని సద్వినియోగం చేసుకోండి

రాపూరు: కిశోరి వికాశంపై శిక్షణ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్‌ సీడీపీవో సునందన తెలిపారు. ఆమె శుక్రవారం నవాబుపేట, కొత్తపేట, సైదాదుపల్లి, బండేపల్లి గ్రామాల్లో మహిళలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి లింగ వివక్ష, మీడియా ప్రభావం, సంపూర్ణ ఆరోగ్యం, పౌష్టికాహారం, నాణ్యమైన విద్య, వ్యక్తిగత పరిశుభ్రత అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కిశోర బాలికలు, మహిళలు, అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అమాయకులపై అక్రమ కేసు

టాస్క్‌ఫోర్స్‌: అక్రమ మైనింగ్‌ను డ్రోన్‌ కెమెరాతో వీడియో తీస్తున్నారనే అనుమానంతో కొందరు రౌడీ మూకల ఫిర్యాదు మేరకు పోలీసులు ముగ్గురు అమాయకులపై కేసు నమోదు చేసి స్టేషన్‌ బెయిల్‌పై విడుదల చేసిన ఘటన సైదాపురంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. చాగణం సమీపంలోని ఒక మైనింగ్‌ సమీపంలో ముగ్గురు యువకులు ఒక వాహనంలో ఉన్నారు. కొందరు రౌడీ మూకలు అక్కడికి వచ్చి ఈ ప్రాంతంలో ఏమి చేస్తున్నారని వారిని దబాయించారు. అంతటితో ఆగక దాడి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు కూడా రౌడీ మూకల మాటలకే విలువ ఇచ్చి ఆ ముగ్గురు యువకులపై కేసు నమోదు చేశారు. తర్వాత స్టేషన్‌ బెయిల్‌ ఇచ్చి సాయంత్రం వదిలిపెట్టారు. మండలంలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సిద్ధారెడ్డి జనార్ధనరెడ్డి సేవలు మరువలేనివి



పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ, తదితరులు

చిల్లకూరు : ప్రముఖ పారిశ్రామికవేత్త సిద్ధారెడ్డి జనార్ధనరెడ్డి పేదలకు చేసిన సేవలు మరువలేనివని రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు కొనియాడారు. సిద్ధారెడ్డి జనార్ధనరెడ్డి నాలుగో వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు వారి కుటుంబ సభ్యులు సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ, సిద్ధారెడ్డి వెంకట సుధీర్‌రెడ్డి, ప్రణతి, శ్రేష్ఠ శుక్రవారం తూర్పుకనుపూరులో సంతాప సభ ఏర్పాటు చేశారు. అనంతరం ఇంటర్‌లో ప్రతిభ చూపిన పేద విద్యార్థులు ఆరుగురిని ఎంపిక చేసి ప్రతిభా పురస్కారాలు, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ సీనియర్‌ నాయకులు కొడవలూరు ధనుంజయరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్‌ యరటపల్లి జానకిరామిరెడ్డి, రెడ్డి సంఘం ప్రతినిధులు చిల్లకూరు దశరథరామిరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, శ్రీకిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, పేట వెంకటక్రిష్ణారెడ్డి, కొత్తపల్లి సనత్‌కుమార్‌రెడ్డి, ప్రజేంద్రరెడ్డి, ధనుంజయరెడ్డి, హరినాథ్‌రెడ్డి, హరిక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బదిలీల్లో అవకతవకలపై ఫిర్యాదు



ఎంఈవోకు ఫిర్యాదు చేస్తున్న ఏపీటీఎఫ్‌ నాయకులు

నాయుడుపేట టౌన్‌ : పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఏపీటీఎఫ్‌ నాయకులు ఆరోపించారు. వారు శుక్రవారం ఎంఈవో మునిరత్నంకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ బాలుర ఉన్నత పాఠశాలలో 2015 నుంచి పనిచేస్తున్న ఉపాధ్యాయులు 2023లో చేరినట్లు చూపి బదిలీల్లో మళ్లీ అక్కడికే పోస్టింగ్‌ వచ్చేలా చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై ఎంఈవో మునిరత్నం వివరణ ఇస్తూ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు బదిలీ ఉత్తర్వులు తప్పుగా వచ్చినట్టు హెచ్‌ఎం తెలిపారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని డీఈవోకు కూడా తెలియజేసినట్టు వెల్లడించారు. ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటారని తెలిపారు.